సాక్షి
విజయనగరం
మంగళవారం । 27 । మే । 2025



కౌలు రైతుల కంటకన్నీరు..!

కూటమి ప్రభుత్వం కౌలురైతులపై కపటప్రేమ చూపుతోంది. అన్నదాత సుఖీభవ పథకానికి కౌలురైతులను దూరంగా ఉంచడంపై కన్నీరుపెడుతున్నారు. - 8లో



హత్య కేసును ఛేదించిన పోలీసులు

శృంగవరపుకోట మండలంలో సంచలనం రేకెత్తించిన తల్లి హత్యకేసును ఎస్.కోట పోలీసులు ఛేదించారు. - 8లో




24 గంటల్లో అర్జీలు పరిష్కరించాలి

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను 24 గంటల్లో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

మడ్డువలసకు జలకళ

- వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



మడ్డువలస ప్రాజెక్టుకు జలకళ

వంగర: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నీటిమట్టం పెరుగుతోంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 1000 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 65 మీటర్లు కాగా, సోమవారం 63.85 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 2.322 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఏటా వేసవిలో ప్రాజెక్టు నీటిమట్టం 62 మీటర్లకు పడిపోయేది. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగింది. పదేళ్ల తర్వాత వేసవిలో ప్రాజెక్టు జలకళ సంతరించుకుకోవడం ఇదే ప్రథమమని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

విచారణకు అధికారుల డుమ్మా..!



తనకు పంపించిన నోటీసును చూపిస్తున్న వల్లూరు మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు అప్పన్న

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు గ్రామంలో చేపల చెరువుల అక్రమ వేలంపై నోటీసులు పంపించిన అధికారులే విచారణకు గైర్హాజరయ్యారని ఆ గ్రామ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు అప్పన్న ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వల్లూరులో ఉన్న చేపల చెరువులను వేలం వేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారన్నారు. దీనిపై గతంలో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయగా ఈ నెల 22న నెల్లిమర్ల ఎంపీడీఓ కార్యాలయానికి విచారణకు హాజరుకావాలని నోటీసు పంపించారన్నారు. ముగ్గురు ఎంపీడీఓలు, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు కూడా విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నప్పటికీ హాజరుకాలేదన్నారు. అధికారుల గైర్హాజరుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పందించని యంత్రాంగం... రైతులే సొంతంగా షట్టర్ల ఏర్పాటు



సంకిలి వద్ద చిట్టిగెడ్డకు షట్టర్లు ఏర్పాటు చేయిస్తున్న సూర్యారావు, రైతులు

రేగిడి: మండలంలోని సంకిలి సాయన్నచానల్‌కు అనుబంధంగా ఉన్న చిట్టిగెడ్డ షట్టర్లు పూర్తిగా పాడయ్యాయి. అధికారులు, పాలకులకు పలుమార్లు సమస్యను రైతులు వినిపించినా స్పందన లేదు. ఖరీఫ్ సమయం ఆసన్నమవుతుండడంతో సాగునీరు అందదని బెంగపడ్డారు. చివరకు పుర్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాలవలస సూర్యారావు, ఖండ్యాం నీటి సంఘం ప్రాదేశిక సభ్యుడు పాలవలస ప్రసాదరావు సొంత నిధులు సుమారు రూ.70 వేలతో షట్టర్లను తయారు చేయించారు. వీటిని గ్రామానికి చెందిన రైతులు రావాడ రవి, ఏనుగుతల దుర్గారావు, పాడి రమేష్, జడ్డు శంకరరావు, బుడుమూరు రాము, పాడి రాము శ్రమదానం చేసి అమర్చారు.

- పిడుగులు, వడగళ్లతో జాగ్రత్త అవసరం
- ఏటా పదుల సంఖ్యలో మరణాలు
- అనేక కుటుంబాల్లో విషాదం
- అప్రమత్తతతోనే ప్రమాదాలకు దూరం

మెరుపు చూసి మసలుకో..!



విజయనగరం గంటస్తంభం:

వాతావరణంలో మార్పులతో మేఘం కమ్ముకుంటే చాలు.. భయపడే రోజులు వచ్చాయి. మెరుపులు, ఉరుములతో పాటు పిడుగుల వాన కురుస్తోంది. పొలాలకు వెళ్లే రైతులతో పాటు మేత కోసం వెళ్లే జీవాలు ఎక్కువగా పిడుగుపాటుకు గురవుతున్నాయి. విషాదాన్ని మిగుల్చుతున్నాయి. కనీస జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుపాటు నుంచి రక్షించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పిడుగులు ఎప్పుడు, ఎక్కడ పడతాయో ముందే అంచనా వేయడంతో పాటు, ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చని సలహా ఇస్తున్నారు.

• ఏప్రిల్- జూన్ మధ్యనే అధికం..

ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనే పిడుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించే వరకు పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతాయి. ఆ సమయంలో సముద్రంలో నుంచి వచ్చే గాలుల్లో తేమ శాతం పెరిగితే దట్టమైన క్యూములోనింబస్ మేఘాలు కమ్ముకుంటాయి. అప్పుడే ఉరుములు ప్రారంభమవుతాయి. పిడుగులు పడుతుంటాయి. గడిచిన కొద్ది రోజుల్లోనే విజయనగరం జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు రైతులు మృతి చెందారు.

• పిడుగులు ఏర్పడడం ఇలా...

ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు నీరు ఆవిరిగా మారి ఆకాశంలో దాదాపు 25,000 అడుగుల ఎత్తు వరకు మేఘాలు ఏర్పడతాయి. పై నుంచి సూర్యరశ్మి అధికంగా తాకడం వల్ల తక్కువ బరువున్న ధనావేశిత(+) మేఘాలు పైకి వెళ్తాయి. అధిక బరువుండే రుణావేశిత (ఎలక్ట్రాన్లు అధికంగా ఉన్న) మేఘాలు కిందికి వస్తాయి. సైన్స్ ప్రకారం, రుణవేశిత మేఘాలలోని ఎలక్ట్రాన్లు సమీపంలోని ధనావేశిత మేఘాలవైపు ఆకర్షితమవుతుంటాయి. ధనావేశిత మేఘాలు చాలా ఎత్తుకు వెళ్లిపోయినప్పుడు దగ్గరలో మరే వస్తువు ఉన్నా అటువైపు ఎలక్ట్రాన్లు ప్రయాణిస్తాయి. ఆ క్రమంలోనే మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు ఒక్కసారిగా విడుదలై విద్యుత్ క్షేత్రంగా మారి భూమి మీదకు దూసుకొస్తాయి. దాన్నే 'పిడుగు పడటం' అంటారు. అలా మేఘాల నుంచి పడే 'పిడుగు'లో దాదాపు 30 కోట్లు ఓల్టుల విద్యుత్ ఉంటుంది.



మొక్కలు నరకడం వల్ల గ్లోబల్ వార్మింగ్ దృశ్యం

• ముందస్తు సమాచారం ఇచ్చేలా..

పిడుగు పాటును ముందస్తుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసే పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ వినియోగిస్తోంది. దీనికోసం ఎర్త్ నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రంలో సెన్సార్లు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఏ సమయంలో పిడుగులు పడే అవకాశముందో ఈ సెన్సర్ల ద్వారా అధికారులు ఓ అంచనాకు వస్తారు. దాంతో మండలాల వారీగా ప్రజల ఫోన్లకు ఎస్సెమ్మెస్‌లు పంపి అప్రమత్తం చేస్తున్నారు. దీని ద్వారా 30 నుంచి 40 నిమిషాల ముందే పిడుగు పడబోయే ప్రాంతాన్ని గుర్తించవచ్చు.

అప్రమత్తతే ప్రాణాలకు రక్ష...

- పత్రికలు, టీవీల ద్వారా వాతావరణ సమాచారం తెలుసుకోవడంతో పాటు స్థానిక అధికారులు చేసే హెచ్చరికలు పాటించాలి.
- పిడుగులు ఎత్తైన భవనాలు, స్తంభాలు, వృక్షాలపై పడే అవకాశం ఎక్కువ. ఎత్తైన ప్రదేశాలకు దూరంగా ఉండాలి.
- ఉరుముల సమయంలో తప్పించుకునేందుకు స్థలం లేకపోతే కిందకు వంగి ఉండాలి.
- కూర్చొన్నప్పుడు పాదాల ముందు భాగం మాత్రం నేలను తాకాలి. మిగిలిన ఏ భాగం నేలను తాకకుండా జాగ్రత్త పడాలి.
- ఉరుములు, మెరుపుల సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదు. మేఘాల్లోని విద్యుత్ తరంగాలతో ఎలక్ట్రానిక్ పరికరాలు పేలుడుకు గురయ్యే ప్రమాదం ఉంది. గృహాల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్లు, తదితర ఎలక్ట్రానిక్ పరికాలకు విద్యుత్ కనెక్షన్ తొలగించాలి.

• పిడుగుపాటు సంకేతాలివే...

ఆకాశంలో నల్లని మబ్బులు పట్టడం, మెరుపులు కనిపించడం, ఉరుములు వినిపించడం, వేగంగా గాలులు వీయడం పిడుగుపాటుకు సంకేతాలుగా భావించాలి.

ఈ ఏడాది జరిగిన ప్రమాదాలు..

- ఈనెల 12న మెంటాడ మండలం కుంటినివలస గ్రామానికి చెందిన కొల్లి రాంబాబు(45) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పులిగుమ్మి సమీపంలో మట్టి తవ్వుతున్న రామారావు సమీపంలో పిడుగు పడడంతో ప్రమాదం సంభవించింది. అతనితో పాటు ఉన్న కొల్లి సింహాచలం, లోకార్పు మురళి గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.
- ఈనెల 14న విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల మండలంలోని పెద్ద బూరడపేట సమీపంలో పిడుగులు బీభత్సం సృష్టించాయి. పిడుగు పాటుకు గ్రామానికి చెందిన డొప్ప త్రినాథ్ అనే రైతుకు చెందిన ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి.
- ఏప్రిల్ 30న ఎస్.కోట మండలం గిరశిఖర పంచాయతీ పరిధిలోని దారపర్తి గ్రామానికి చెందిన పదేళ్ల చిన్నారి కిరణ్ పిడుగుపాటుకు మృతి చెందగా.. అతని సోదరుడు అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. వర్షానికి తడవకుండా చెట్టుకింద ఉన్న ఆవులను ఇంటికి తీసుకు వచ్చేందుకు వెళ్లిన సమయంలో పిడుగు పడడంతో ప్రమాదం సంభవించింది.
- ఈనెల 15న పొలాన్ని దుక్కిచేయించేందుకు వెళ్లిన పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట మండలం దేవనాపురం పంచాయతీ జగత్‌పల్లి బూర్జిగూడ చెందిన సవర చంద్రరావు(28) పిడుగుపాటుకు గురై మృతిచెందాడు.

జాగ్రత్త పడాలి




వర్షాకాలంలో వాతావరణ శాఖ హెచ్చరికలను పాటించాలి. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద ఉండరాదు. చేతిలో సిల్వర్ పాత్రలు ఉంచరాదు. రైతులు అప్రమత్తంగా ఉండాలి. పొలానికి వెళ్లే సమయంలో వర్షం ప్రారంభమైతే వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. చెట్ల సంరక్షణతో వేడిని తగ్గించగలిగితే పిడుగుల ప్రభావం నుంచి బయటపడవచ్చు.

– ఆర్.కొండలరావు, జిల్లా అటవీ శాఖ అధికారి

కోవిడ్‌పై సన్నద్ధత శూన్యం..!

- పొరుగు జిల్లాలో కోవిడ్ కేసుల నమోదు
- జిల్లాలో ఎటువంటి సన్నాహాలు చేయని వైనం
- నిర్ధారణ పరీక్షలకు ఏర్పాట్లు లేవు..
- కోవిడ్ లక్షణాలు ఉన్న వారు వస్తే పరిస్థితి ఏమిటన్న సందేహాలు



కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో మాస్కులు ధరించి విధులు నిర్వర్తిస్తున్న సర్వజన ఆస్పత్రి ల్యాబొరేటరీ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: కోవిడ్ పేరు వింటేనే జనంలో వణుకుపుడుతుంది. నాలుగేళ్ల కిందట విలయతాండవం సృష్టించిన మహమ్మారి మళ్లీ దేశంలోకి ప్రవేశించింది. కేసుల నమోదు రోజురోజుకూ పెరుగుతోంది. మన పొరుగునే ఉన్న విశాఖపట్నం జిల్లాలో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. కోవిడ్‌ను ఎదుర్కొనే సన్నద్ధత చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసి కోవిడ్ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొందని, వైద్య సేవలతో మరణాలను తగ్గించగలిగిందని, ప్రస్తుతం అలాంటి ఏర్పాట్లు ఏవీ లేకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కోవిడ్ పరీక్షలకు ఏర్పాట్లు ఏవీ..?

ఏ ఆరోగ్య సమస్య వచ్చినా జిల్లా ప్రజలు అధిక మంది ఆశ్రయించేది ప్రభుత్వ సర్వజన ఆస్పత్రినే. అటువంటి ఆస్పత్రిలో కోవిడ్ వ్యాప్తి చెందితే ఎదుర్కొనేందుకు ఎటువంటి ముందుస్తు చర్యలు కనిపించడం లేదు. కోవిడ్ రోగులకు ప్రత్యేక వార్డు ఇంతవరకు గుర్తించ లేదు. కోవిడ్ లక్షణాలు ఉన్నవారు వస్తే వారికి ఆర్‌టీపీసీఆర్ టెస్టు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కూడా ఇంతవరకు చేయలేదు. ఈ నేపథ్యంలో కోవిడ్ వ్యాప్తి పెరిగితే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అప్పటిలో పటిష్ట చర్యలు

కోవిడ్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంది. కోవిడ్ అనుమానిత లక్షణాలు ఉన్న వారందరికీ గ్రామాలకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన చికిత్స అందించే ఏర్పాట్లు చేసింది. ప్రజల ఆరోగ్య పరిస్థితిని బట్టి హోం ఐసోలేషన్‌లో కొందరికి, క్వారంటైన్ సెంటర్లలో కొందరికి, ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేసి మరికొందరికి చికిత్స అందించింది. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సదుపాయాలను కల్పించింది. కోవిడ్ వైరస్ సోకినా ప్రభుత్వం చికిత్స చేయిస్తుందనే ధీమా ఉండేది. ఇప్పుడు అలాంటి చర్యలేవీ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఆదేశాలు రాలేదు..

కోవిడ్ ఏర్పాట్లపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. డీఎంఈ సూచనల మేరకు ఏర్పాట్లు చేస్తాం.

– డాక్టర్ అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

- జిల్లా అధికార యంత్రాంగానికి లక్ష్మీపేట దళిత సంఘాల నాయకుల వినతి

విజయనగరం టౌన్: వంగర మండలం లక్ష్మీపేట దళితుల ఊచకోత కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఉత్తరాంధ్ర దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉత్తరాంధ్ర దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేసు విచారణలో పక్షపాత వైఖరి చూపిస్తున్న లక్ష్మీపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ నాయకులు కంత వేణు, శ్రీను, ఉదయ్ భాస్కర్, బాబూరావు, చిత్ర గంగులు, గురుమూర్తి, భీమారావు, కృష్ణ, నాగరాజు, రామప్పడు, రవి, ఆదాడమోహనరావు, పి.వి.రమణ, బొంగ భానుమూర్తి, రాజేష్, చంటి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

3,168 మందికి తప్పని బదిలీ!

- నేటితో ముగియనున్న ఎస్టీజీల దరఖాస్తు గడువు

తప్పని సరి బదిలీ టీచర్లు కేటగిరీవారీగా....:

టీచర్ కేటగిరీ	మిగులు టీచర్లు	ఎనిమిదేళ్ల సర్వీసు	మొత్తం
హెచ్‌ఎం	00	26	26
ఎస్‌ఏ మాథ్స్	137	148	285
ఎస్‌ఏ పీఎస్	84	129	213
ఎస్‌ఏ బీఎస్	74	110	184
ఎస్‌ఏ ఎస్‌ఎస్	93	57	150
ఎస్‌ఏ ఇంగ్లిష్	135	74	209
ఎస్‌ఏ హిందీ	32	38	70
ఎస్‌ఏ తెలుగు	79	46	125
ఎస్‌ఏ పీడీ	9	51	60
పీఎస్‌హెచ్‌ఎం	3	0	03
ఎస్‌జీటీ	946	851	1,797
ఎల్‌పీ హిందీ	3	0	3
ఎల్‌పీ తెలుగు	31	01	32
పీఈటీ	2	9	11
మొత్తం	1628	1,540	3,168

ఇంతవరకు నమోదయిన బదిలీ దరఖాస్తులు.. టీచర్లు కేటగిరీవారీగా..

టీచర్ల కేటగిరీ	దరఖాస్తులు	తప్పని సరి బదిలీ	రిక్వెస్ట్
ప్రధానోపాధ్యాయులు	100	26	74
పీఎస్ హెచ్‌ఎం	125	72	53
ఎస్‌జీటీ	2,410	1,728	682
ఎస్‌ఏ నాన్ లాంగ్వేజ్	1,361	890	471
ఎస్‌ఏ లాంగ్వేజ్	753	401	351
పీఈటీలు	27	14	13

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయుల బదిలీల లెక్క కొలిక్కి వచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో 3,168 మందికి తప్పనిసరిగా స్థానచలనం జరగనుందని విద్యాశాఖ లెక్క తేల్చింది. తప్పనిసరి బదిలీ కింద 1,540 మంది, రేషనలైజేషన్ కారణంగా మిగులు ఉపాధ్యాయులు మరో 1,628 మంది ఉన్నారు. ఎస్జీటీలు మినహా మిగిలిన హెచ్‌ఎంలకు ఈ నెల22తో, స్కూల్ అసిస్టెంట్లకు ఆదివారం అర్ధరాత్రితో బదిలీ దరఖాస్తు నమోదు ప్రక్రియ ముగిసింది. ఎస్జీటీల బదిలీ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 27తో ముగియనుంది. ఎస్జీటీలకు మాన్యువల్ ద్వారా, మిగిలిన కేటగిరీల వారికి వెబ్ ఆప్షన్ ద్వారా బదిలీ చేస్తామని విద్యాశాఖ ప్రకటించింది. కానీ తొలుత విడుదల చేసిన జీఓను మార్పుచేసి మరో జీవోను ఇంతవరకు విడుదల చేయకపోవడంపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్



ఎస్.తవిటినాయుడు, ఆర్‌ఐఓ

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్‌ను ఈ నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు సోమవారం తెలిపారు. పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. వార్షిక పబ్లిక్ పరీక్షల్లో గైర్హాజరయిన 63 మంది జనరల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేశామన్నారు. అలాగే, ఒకేషనల్ విభాగంలో ఇంటర్ పరీక్షలు రాయాల్సిన 422 మంది కోసం జిల్లాలో తొమ్మిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. వీటిలో రాజాంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ రామ ఒకేషనల్ జూనియర్ కళాశాల, ఎస్.కోటలోని ప్రభుత్వ, ఏపీఎస్, దీప్తి, శ్రీవరలక్ష్మి జూనియర్ కళాశాలలు, నెల్లిమర్లలోని సీకేహెచ్ జూనియర్ కళాశాల, గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజయనగరం ఎస్ఎస్‌పీ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఉన్నాయి. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని కోరారు.



అక్రమ తవ్వకాలతో తరిగిపోతున్న రెల్లివలస సమీపంలోని కొండ

- కొండలను కొల్లగొడుతున్న అధికారపార్టీ నాయకులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని భూగర్భగనుల శాఖ అధికారులు

అధికారం ఉంది.. తవ్వేద్దాం..!

పూసపాటిరేగ:

అధికార బలం ఉంది.. అడిగేవారు ఎవరు?.. కొండలను తవ్వేద్దాం.. రెండు చేతులా ఆర్జిస్తాం అన్నట్టుగా పూసపాటిరేగ మండలంలో అక్రమక్వారీయింగ్ సాగుతోంది. రాత్రీపగలు తేడా లేకుండా యంత్రాలతో కొండలను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లు, లారీలతో గ్రావెల్‌ను తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. దీనికి రెల్లివలస రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్1లో ఉన్న కొండపై తవ్వకాలే నిలువెత్తు నిదర్శనం. రెల్లివలస జగనన్న కాలనీని ఆనుకొని ఉన్న కొండను తవ్వి విలువైన గ్రావెల్‌ను రియల్‌ఎస్టేట్ వెంచర్లు, నూతనంగా నిర్మాణం అవుతున్న పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. ఇదంతా అధికార పార్టీ స్థానిక నాయకుల కనుసన్నల్లోనే సాగుతుండడం గమనార్హం. కొండ తరగిపోతున్నా భూగర్భ గనులు శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొరపాటున భూగర్భ గనులు శాఖ అధికారులకు అక్రమ క్వారీయింగ్‌పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. వారి పేర్లను అక్రమార్కులకు చేరవేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలో పరిశ్రమలు ఎక్కువగా ఉండడం, వాటిలో జరిగే నిర్మాణాలకు గ్రావెల్ అవసరం అక్రమార్కులకు కలిసొస్తోంది. కొద్దినెలలుగా అక్రమక్వారీయింగ్ దందా యథేచ్ఛగా సాగుతోంది.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకొని సహజ వనరులను కాపాడాలని సామాజిక వేత్తలు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని భూగర్భ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహనరావు వద్ద ప్రస్తావించగా అక్రమక్వారీయింగ్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కులపై చర్యలకు ఆదేశిస్తామని చెప్పారు.

కీచక ఉపాధ్యాయుడిపై దర్యాప్తు

రేగిడి: మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నిర్వాకంపై సోమవారం ఎంఈఓ-2 బి.ఎరకయ్య దర్యాప్తు చేశారు. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను గర్భవతిని చేశాడన్న వార్త సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో రావడంతో దర్యాప్తునకు డీఈఓ మాణిక్యంనాయుడు ఆదేశించారు. ఆ పాఠశాల హెచ్‌ఎంను సోమవారం ఎంఈఓ-2 వెళ్లి కలిశారు. వివరాలు సేకరించారు. పాఠశాలలో అటువంటి ఘటనలు చోటుచేసుకోలేదని, బాలిక, ఆమె కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని హెచ్‌ఎం తెలిపారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేసినట్టు ఎరకయ్య తెలిపారు.

క్లుప్తంగా

తల్లీకొడుకుల అదృశ్యం

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామానికి చెందిన తల్లీకొడుకులు ఈ నెల 23 నుంచి కనిపించడంలేదు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 23న రాత్రి కుటుంబసభ్యులు ఇంట్లో గొడవ పడ్డారు. ఇంట్లో గొడవ అనంతరం అందరూ గాఢనిద్రలో ఉన్నసమయంలో కొడుకును తీసుకుని తల్లి ఇంటినుంచి వెళ్లిపోయినట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. 24న ఉదయం నుంచి తల్లీకొడుకుల ఆచూకీ కోసం గ్రామంలోనే కాకుండా చుట్టాలు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ కనిపింకపోవడంతో అదృశ్యమైన మహిళ తల్లి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

లారీని ఢీకొని యువకుడి మృతి


జగన్ మృతదేహం

గంట్యాడ: బొండపల్లి మండలం రాళ్లవాక గ్రామానికి చెందిన యువకుడు బొండపల్లి జగన్ (19) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హోరోహోండా గ్లామర్ బైక్‌పై కింతాడ మధు అనే వ్యక్తితో కలిసి బొండపల్లి జగన్ ఆదివారం రాత్రి విజయనగరం మండలం సారిక గ్రామానికి వెళ్తుండగా రామవరం ఫైఓవర్‌పై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో జగన్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మధుకు తల, ఎడమ కాలికి తీవ్ర గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

మామిడి తోట ధ్వంసం


ఏనుగులు పెకిలించిన చెట్లను పరిశీలిస్తున్న స్థానికులు

గరుగుబిల్లి: ఏనుగుల గుంపు ఆదివారం రాత్రి గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో ప్రవేశించి గ్రామానికి చెందిన లోపింటి వెంకయ్య మామిడి తోటను ధ్వంసం చేశాయి. మరో రెండు మూడు రోజుల్లో చేతికి రావాల్సిన పంటను నష్టపరిచాయి. 15ఏళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఎకరా డీ పట్టా భూమిలో మామిడి తోటను వేసుకుని జీవనోపాధి పొందుతున్న వెంకయ్యకు చేతికి అందిన పంట ఏనుగుల రూపంలో నష్టపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంటను నష్టపరచడమే కాకుండా కొన్ని చెట్లను కూడా భూమి నుంచి పెకిలించి వేశాయని బాధితుడు వాపోయాడు. ఏనుగుల కారణంగా మామిడి తోటలో సుమారు రూ.50వేల వరకు నష్టం జరిగిందని, అధికారులు స్పందించి జరిగిన పంటనష్టాన్ని అంచనావేసి పరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజాం సిటీ: మండల పరిధి గడిముడిదాం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బలిజిపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి వెంకటరమణ (40) మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన వివరాల మేరకు వెంకటరమణ ద్విచక్రవాహనంపై రాజాం వస్తున్నాడు. గడిముడిదాం-బుచ్చెంపేట గ్రామాల మధ్యకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన ఆటో బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరమణను ఆటో డ్రైవర్ స్థానిక కేర్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి విశాఖపట్నం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని మేనమామ శంబంగి జగన్మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

కౌలు రైతుల కంటకన్నీరు..!


భూమి దున్నుతున్న రైతు

- అన్నదాత సుఖీభవ లేనట్లేనా అని ఆందోళన
- వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుభరోసా అందజేత

కౌలు రైతులకు వర్తించదు

అన్నదాత సుఖీభవ పథకం కోసం భూయాజమానులు, అటవీ భూమి సాగు చేస్తున్న రైతుల వివరాలు వెరిఫికేషన్ చేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వారికే వెరిఫికేషన్ చేస్తున్నాం. కౌలు రైతులకు ఈ విడతలో అన్నదాత సుఖీభవ వర్తించదు. కౌలు రైతుల గుర్తింపు, రెన్యువల్ జరుగుతుంది.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

విజయనగరం ఫోర్ట్: అధికారంలోకి వస్తే రైతులందరికీ రైతు భరోసా సాయాన్ని పెంచుతాం. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. తీరా అధికారంలో వచ్చిన మొదటి ఏడాదే రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎగ్గొట్టింది. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ ఇస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. ఇందుకోసం రైతుల వివరాలను వెరిఫికేషన్ చేస్తున్నారు. అయితే కౌలు రైతులకు మాత్రం అన్నదాత సుఖీభవ పథకం వర్తించే సూచనలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే కౌలు రైతుల గుర్తింపు పక్రియ పూర్తిస్థాయిలో ఇంతవరకు జరగలేదు. దీని వల్ల వారికి అన్నదాత సుఖీభవ సాయం అందడం అనుమానంగా కనిపిస్తోంది.

ఈ ఏడాది కౌలు రైతుల గుర్తింపు లక్ష్యం 16250

2025–26 ఖరీఫ్ సీజన్‌లో వేలాది మంది కౌలు రైతులను గుర్తించాల్సి ఉంది. కానీ వ్యవసాయ అధికారులు చాలా తక్కువ మందిని గుర్తించారు. ఈ ఏడాది 16,250 మంది కౌలు రైతులను గుర్తించాల్సి ఉండగా ఇంతవరకు గుర్తించింది కేవలం 200 మందిని మాత్రమే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏప్రిల్, మే నెలలోనే కౌలు రైతుల గుర్తింపుపై అవగాహన సదస్సులు నిర్వహించి కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు ఇచ్చేవారు. కానీ ఈఏడాది మే నెల రెండో వారం వరకు ఆ ప్రక్రియ ప్రారంభం కానట్లు తెలుస్తోంది.

భూయాజమానులు, అటవీభూములు సాగు చేసే వారికే..

అన్నదాత సుఖీభవ పథకం కింద అందించే ఆర్థిక సాయానికి భూయాజమానులు, అటవీ భూములు సాగు చేసే వారే అర్హులని ప్రభుత్వం పేర్కొంది. దీన్ని బట్టి కౌలు రైతులకు ఆర్థిక సాయం ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలుస్తోంది. జిల్లాలో భూయాజమానులకు, అటవీభూమి సాగు చేసే రైతులకు వ్యవసాయ అధికారులు అన్నదాత సుఖీభవ పథకం కోసం వెరిఫికేషన్ చేస్తున్నారు. జిల్లాలో 4,89,252 మంది రైతులు ఉన్నారు. వారిలో 2,159 మంది అటవీ భూమి సాగుచేసే వారు ఉన్నారు. మొత్తం రైతుల్లో 4,36,744 మంది రైతులకు వెరిఫికేషన్ చేశారు. ఇంకా 50 వేల మందికి పైగా వెరిఫికేషన్ పూర్తి కావాల్సి ఉంది. ఈనెల 25వతేదీతో వెరిఫికేషన్‌కు గడువు పూర్తవుతుంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా సాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భూయాజమానులు, అటవీభూమి సాగు చేసే రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం కింద సాయం అందజేశారు. దీంతో వారు మిగతా రైతుల మాదిరి వారు సాగు చేసిన పంటలకు పెట్టుబడి పెట్టుకునే వారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునే వారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

శృంగవరపుకోట: మండలంలో సంచలనం రేకెత్తించిన తల్లి హత్యకేసును ఎస్.కోట పోలీసులు ఛేదించారు. ఈ మేరకు కేసు వివరాలను సోమవారం ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ రాత్రి తన తల్లి, చెల్లి బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి తన తల్లి ఎర్రాప్రగడ వెంకటలక్ష్మి(35)ని తీసుకుపోయారని చెల్లెలు రుచిత చెప్పిందని వెంకటరమణపేట గ్రామానికి చెందిన ఎర్రాప్రగడ హరీష్ 18వ తేదీ ఉదయం 5గంటలకు ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అనుమానాలే ఆధారంగా..

హరీష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేయగా ఘటనాస్థలిలో రక్తపుమరకలు ఉండడంతో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టామన్నారు. రుచిత వాదనల్లో సరైన పొంతన లేకపోవడంతో అనుమానంతో గట్టిగా విచారణ చేయడంతో వాస్తవాలు చెప్పింది. తన తల్లిని ఎవరూ కిడ్నాప్ చేయలేదని, తన స్నేహితులతో కలిసి పథకం ప్రకారం హత్య చేశామని చెప్పింది. శవాన్ని దగ్గరలోని నేలబావిలో రాళ్లు కట్టి పడేసి, కొబ్బరి మట్టలు వేసి కప్పారన్నారు. దీంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించినట్లు డీఎస్పీ చెప్పారు.

ప్రేమ వికటించింది

గ్రామానికి చెందిన సలాది హరికృష్ణ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆ డ్రైవర్ రుచితతో కొన్నాళ్లుగా ప్రేమాయణం సాగించాడు. ఇది నచ్చని రుచిత తల్లి వెంకటలక్ష్మి తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయనని చెప్పింది. అప్పటికీ హరికృష్ణ తన తీరు మార్చుకోక పోవడంతో వెంకటలక్ష్మి ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. దీంతో హరికృష్ణపై పోక్సో కేసు నమోదైంది. ప్రస్తుతం కేసు ట్రయల్స్‌కు రావడంతో తనపై కేసు తీసేయాలని, రుచితను తనకిచ్చి పెళ్లి చేయాలని, వెంకటలక్ష్మిని హరికృష్ణ ఒత్తిడి చేశాడు. ఆమె అంగీకరించక పోవడంతో రుచితతో కలిసి హత్యకు పథకం పన్నాడు. బహిర్భూమికి అంటూ రుచితతో చెప్పించి వెంకటలక్ష్మిని బయటకు రప్పించి హరికృష్ణ, రుచితలు మరో బాలుడితో కలిసి, గొంతు కోసి హత్య చేశారు. రుచితను జువైనల్ హోమ్‌కు తరలించి హత్య చేసి పరారైన హరికృష్ణ కోసం మూడు బృందాలను రంగంలోకి దించారు. సోమవారం అందిన సమాచారంతో ఒడిశా వైపు బైక్‌పై వెళ్తున్న హరికృష్ణను, హత్యానేరంలో ఉన్న మరో బాలుడిని అరెస్టు చేసి, వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, వాంగ్మూలం రికార్డు చేసి, కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వి.నారాయణమూర్తి, ఎస్సైలు చంద్రశేఖర్, గంగరాజు పాల్గొన్నారు.

కదులుతున్న చోరీ కేసులో డొంక

- సమాచార సహకారంలో చీపురుపల్లికి చెందిన ఓ వ్యక్తి
- ఇంతవరకు ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మిగిలిన వారి కోసం గాలింపు

చీపురుపల్లి: తీగలాగితే డొంక కదిలిందన్న చందంగా ఉంది చీపురుపల్లిలో ఈ నెల 23న జరగిన చోరీ ఘటన. ఈ చోరీ కేసులో దొంగలను పట్టుకుంటున్న పోలీసులకు విచారణలో మరిన్ని విషయాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. చోరీకి పాల్పడిన వారిలో అధిక సంఖ్యలో వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో ఇంతవరకు ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ ఇంకా చాలా మంది ఉన్నారని గుర్తించి మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చోరీ జరిగిన 24 గంటల్లోనే డిజిటల్ సహకారంతో తెనాలిలో ఇద్దరు దుండగులను గుర్తించిన పోలీసులకు వారిని పట్టుకుని విచారణ చేస్తున్న సమయంలో మరిన్ని వాస్తవాలు తెలిసినట్లు సమాచారం. ఆ ఇద్దరు మాత్రమే కాకుండా చాలా మంది పాత్ర ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకనే చోరీ జరిగి నాలుగు రోజులు కావస్తున్నప్పటికీ 24 గంటల్లోనే ఇద్దరు, మరో 24 గంటల్లో ముగ్గురు దుండగులు దొరికినప్పటికీ పోలీసులు ఇంకా ఒక కొలిక్కి రాలేకపోతున్నట్లు చర్చ జరుగుతోంది.

సమాచార సహకారంలో చీపురుపల్లి వ్యక్తి..

ఈ నెల 23న పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో జరిగిన చోరీ ఘటనలో రోజుకో కొత్త కోణం బయటకు వస్తోంది. చోరీ జరిగిన ఇంటికి సంబంధించి ఓ మహిళ రెక్కీ నిర్వహించి ఫొటోలను దుండగులకు అందజేసినట్లు ఇప్పటికే చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా చోరీ జరిగిన ఇంటి యజమాని, ఆయన స్థితిగతులు, ఆర్థిక వివరాలు వంటి సమాచారాన్ని మండలంలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి దుండగులకు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిసింది.

ఉత్సవ కమిటీ వసూలు చేసిన చందాలపై విచారణ చేపట్టండి

సాలూరు: ఎండోమెంట్ పరిధిలో గల సాలూరు శ్యామలాంబ అమ్మవారి పండగకు అనధికారికంగా మంత్రి సంధ్యారాణి ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ లక్షల రుపాయలు చందాలు వసూలు చేసిందని ఆరోపిస్తూ, వాటిపై విచారణ జరపాలని జనసేన నాయకుడు రేగు మహేశ్వరరావు, రిపబ్లికన్ పార్టీ నాయకుడు గొంప ప్రకాశరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, దేవాదాయశాఖ పరిధిలో శ్యామలాంబ ఆలయం ఉందని, కావున అమ్మవారి పండగను ఎండోమెంట్ అధికారులు నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ అనధికారికంగా ఓ కమిటీని వేసి ప్రజల నుంచి చందాల రూపంలో కొన్ని రూ.కోట్లు వసూలు చేశారని ఆరోపించారు.ఈ అనధికార కమిటీ ఎంత చందాలు వసూలు చేసింది? ఎంత ఖర్చు చేసిందో? ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో జాయింట్ కలెక్టర్‌కు ఈ మేరకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కరించాలి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం తక్షణమే విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ విజయనగరం జిల్లా నాయకులు టీవీ రమణ, కె.అప్పలసూరి, బి.రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కు పరిశ్రమ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..32 మంది బలిదానంతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని, ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం అమ్మేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని, మరింత సమర్థవంతంగా నడపాలని పోరాడుతుంటే, 4000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి, నిర్బంధం ప్రయోగించి, ఉద్యమాన్ని అణిచివేయాలని కేంద్రం భావిస్తోందని ఆరోపించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం ద్వారా విశాఖ ఉక్కు పరిరక్షణ కట్టుబడి ఉంటామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ స్పందించి స్టీల్‌ప్లాంట్ సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్ సెల్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి శంకర్రావు, ఎం.వాసు, వి.లక్ష్మి, సూర్యనారాయణ, జగన్మోహన్ రావు, ఆనంద్, పెంటరాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి మృతి

లక్కవరపుకోట: మండలంలోని అరకు–విశాఖ రోడ్డులో సంతపేట జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్లాపల్లి గ్రామానికి చెందిన కొటాన రమేష్ (40) మృతిచెందాడు. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమేష్ తన ద్విచక్రవాహనంపై ఎల్.కోట వెళ్లి వస్తుండగా కొత్తవలస నుంచి ఎస్.కోట వైపు వెళ్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలోని ప్రయాణికుడితో పాటు డ్రైవర్‌కు గాయాలు కావడంతో ఎస్.కోట సీహెచ్‌సీకి స్థానికులు తరలించారు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు.

భారతీయ సంస్కృతిలో భాగం యోగా


యోగాలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


యోగా నేర్పిస్తున్న గురువు

- జిల్లాకేంద్రంలో సామూహిక యోగాభ్యాసం

విజయనగరం: భారతీయ సంస్కృతిలో సంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటి అని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం రోడ్డులో సామూహిక యోగాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోట వరకు ర్యాలీ చేపట్టారు. ప్రజలు, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు అధికంగా పాల్గొని యోగ ఔన్నత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని యోగా ఆవశ్యకతపై చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలను వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగం నిర్వహిస్తుందని చెప్పారు. ఒక్కో ప్రధాన ప్రాంతంలో రెండు రోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ యోగా అభ్యసించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జీవన్ రాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరావు, అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఈఈ టి.రాయల్ బాబు, టీపీఆర్‌ఓ సింహాచలం, డీఈలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

SURESH SCHOOL
GAJAPATHINAGARAM

HIRING

Requirements : Any Degree/P.G with B.Ed/D.Ed/Diet
: Fluency in English Mandatory
: Minimum Experience of 2 years

Name of the Posts	Pay Scale
1) Nursery LKG, UKG Teachers	- 10,000 - 12,000
2) 1st to 5th Class Teachers (English, Maths, Science, Social Studies)	- 12,000 - 16,000
3) 1st to 5th Class Teachers (Telugu & Hindi)	- 10,000 - 12,000
4) 6th - 10th - IIT (Maths, Physics, Chemistry)	- 25,000 - 40,000
5) 6th - 10th (English, Science, Social Studies, Maths)	- 18,000 - 25,000
6) 6th - 10th (Telugu, Hindi)	- 15,000 - 20,000
7) Computer Teacher with coding skills	- 12,000 - 20,000
8) P.E.T	- 10,000
9) Arts & Craft Teachers	- 7,000 - 10,000
10) Office and Administrative Staff	- 10,000 - 12,000

Note : Salary is negotiable for deserving candidates
Venue : SURESH SCHOOL, Gajapathinagaram.
Time : 9.00 AM - 1.00 PM (Everyday until 03-06-2025)
Contact : 9618869288, 7993385420

24 గంటల్లో అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్‌ఎస్‌కు 160 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను 24 గంటల్లో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన పీజీఆర్‌ఎస్‌లో వినతులు స్వీకరించే ముందు అధికా రులతో సమీక్షించారు. ఆన్‌లైన్‌లో ఇంకా చూడవలసిన వినతులు 8 ఉన్నాయని గడువు దాటిన వినతులు 2 ఉన్నాయని వినతుల పరిషాకరంలో గడువు దాటినందుకు సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం లోగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. రీ ఓపెన్ కేసులు లేకుండా చూడాలని జిల్లా ఆడిట్ టీమ్ కూ డా పెండింగ్ లేకుండా ఎప్పటి వినతులు అప్పుడే ఆడిట్ చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 160 వినతులు అందాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించిన భూసమస్యలు 82 నమోదయ్యాయి. పంచాయతీ రాజ్ శాఖ 10, పింఛన్ల మంజూరు చేయాలని తదితర అంశాలపై డీఆర్‌డీఏకు 21, మున్సిపాలిటీకి 10, జీఎస్‌డబ్ల్యూకు 1, విద్యాశాఖకు 7, హౌసింగ్‌కు 1 అందగా వైద్యశాఖకు 2, విద్యుత్ శాఖకు 5 వినతులు అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

కలెక్టరేట్ వద్ద సహాయ కేంద్రం

ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే నిరక్షరాస్యులకు అర్జీలను రాయడానికి కలెక్టరేట్ వద్ద సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్జీదారుల కోసం షామియానా ఏర్పాటు చేసి కలెక్టరేట్ నుంచి ఆరుగురు సిబ్బందిని నియమించడంతో అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌ఓ కార్యాయలం వద్ద మరో ఇద్దరు అర్జీలు రాసే సహకారం అందజేయడంతో మధ్యవర్తుల జాడ కనబడలేదు. నిరక్షరాస్యులైన వారు తమ అర్జీలను రాయడానికి దళారులను ఆశ్రయిస్తున్నారని వారు అర్జీదారులను మభ్య పెట్టి వారి నుంచి డబ్బును తీసుకుని ప్రతివారం కలెక్టరేట్ చుట్టూ తిరిగేలా చేస్తున్నారని ఇకపై కూడా అర్జీదారులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని జిరాక్స్ కేంద్రాల్లో రాయించవద్దని కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన హాయకేంద్రంలో సంప్రదించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

బదిలీల ఫైళ్లు ముందుగానే పెట్టండి

బదిలీల ఫైళ్లను ఆఖరి తేదీన కాకుండా ముందుగానే పెట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బదిలీలలో ఎటువంటి సిఫార్సులను ఆమోదించబోనని, నిబంధనల మేరకే చేపడతానని స్పష్టం చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత

అడిషనల్ ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల వేదిక కార్యక్రమాన్ని ఏఎస్పీ సౌమ్యలత నిర్వహించి 32 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ఫిర్యాదుదారుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని సిబ్బందిని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్బీ సీఐలు ఆర్వీఆర్కే చౌదరి,లీలారావు డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

■ I, YESOBU TALARI S/o JANAIAH R/o 1-50/A Kistapuram Mudigonda Khammam Andhra Pradesh-507158 changed my name to TALARI VEERAIAH. [I-1242859]

■ I, SIVA MADHAVA REDDY NARREDDY S/o NARREDDY PULLA REDDY R/o 22-4-50/303 Amrutha residency Rajareddy street Tirupati Chittoor Andhra Pradesh-517501 changed my minor Daughter's name from N VEERALAKSHMI GEETHIKA alias N LAKSHMI GEETHIKA REDDY to N LAKSHMI GEETHIKA REDDY aged 16 Years. [I-1242860]

WANTED

■ పైడా కాలేజీ పటవల, కాకినాడ– క్యాంటీన్ యందు పనిచేయుటకు వంటమనిషి (Cook) కావలెను. జీతం : 10000–20000+వసతి ఇవ్వబడును. ఫోన్ : 9491999597, 8331040530 [HA-11839]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640258899, 9640468899 [HA-1909]

■ Hyd చేవెళ్లలో కాలేజీలో ఉంటూ పని చేయడానికి భార్యాభర్తలు కా॥. జీ: 20000 + వసతి. Ph: 8919737607/ 8328443702 [SCA25004025]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15904]

■ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు బి-ఫార్మసీ, డి-ఫార్మసీ, థియేటర్ అసిస్టెంట్ ఏఎస్ఎం, జిఎన్ఎం కావలెను & ITI, Diploma, B.Tech వారు వెంటనే కావలెను.Ph: 7989953868 [HA-181]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.